మనం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

బుధవారం | 4 | నవంబర్ | 2026 | పేజీలు 9 | www.manamepaper.com



పుట్టిన గడ్డకు మేలు చేయడమే నా సంకల్పం

మక్తల్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ.. 39 గ్రామాల సమస్యలపై సమీక్ష

మక్తల్ నియోజకవర్గంలో రూ.2,200 కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామాల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

2లో..

మక్తల్-నారాయణపేట నాలుగు లేన్ల రహదారికి రూ.237 కోట్లు

త్వరలో పనులు ప్రారంభం : మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మక్తల్ మండలంలోని 39 గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంగళవారం మక్తల్ క్యాంపు కార్యాలయంలో గ్రామాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. సర్పంచులు, ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి ప్రతి గ్రామానికి 20 నుంచి 30 నిమిషాల సమయం కేటాయించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

– నారాయణపేట

నవంబర్ 3 (మనం న్యూస్)



తొమ్మిదేళ్లు దోచుకున్న దొంగలు మీరు..

ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరా? మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టి కమిషన్లు దండుకుని రైతాంగానికి తీరని అన్యాయం చేసిన గత పాలకులు ఇప్పుడు అదే ప్రాజెక్టుల పేరుతో రాజకీయ విమర్శలకు దిగడం దొంగే దొంగ దొంగ అన్న చందంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. మంగళవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి తో కలిసి మాట్లాడారు.

వనపర్తి, నవంబర్ 4 (మనం ప్రతినిధి) : పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, జూరాల ప్రాజెక్టుల పనులు పూర్తికాకపోవడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. జూరాల నిల్వ సామర్థ్యం, రామన్ పాడు సమాంతర కాలువ సాంకేతిక లోపాలు, గూడెం దొడ్డి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారన్నారు. పాలమూరు-రంగారెడ్డి 90 శాతం పూర్తయిందన్న హరీష్ రావు వ్యాఖ్యలను తప్పుబట్టారు. అంచనా

- మిగతా 2లో..



భూ తగాదాల పరిష్కారానికి రీ సర్వే

9లో..

రీ సర్వే పనులు పారదర్శకంగా నిర్వహించాలి

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఎల్‌నినో ఎఫెక్ట్.. ఎండుతున్న రైతన్న ఆశలు

అప్పక్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లిలో పంటలను పరిశీలించిన కలెక్టర్

తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి: కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట నవంబర్ 3 (మనం న్యూస్) : ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. నారాయణపేట మండల పరిధిలోని అప్పక్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ఆయా గ్రామాలకు చెందిన రైతుల పంట

- మిగతా 9లో..

తొమ్మిదేళ్లు దోచుకున్న దొంగలు మీరు..

మొదటి పేజీ తరువాయి



వ్యయం ఎంత, ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారు, మిగిలిన పనులు ఏంటో వాస్తవాలు ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల వినియోగం, ఏపీకి నీటి తరలింపుపై గత ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్లే పాలమూరు రైతులకు నష్టం జరిగిందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతోందని, కరువు పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

బీఆర్ఎస్ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు : ఎమ్మెల్యే మేఘారెడ్డి

తొమ్మిదేళ్ల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రాష్ట్రంలో 365 కరువు మండలాలను ప్రకటించిన కొద్ది రోజులకే విమర్శలకు దిగడం వారి అవకాశవాదానికి నిదర్శనమన్నారు. గతంలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారు, పాలమూరుకు ఎంత నీరు ఇచ్చారో ముందు చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక లెక్కల ఆధారంగా వాస్తవాలు వెల్లడిస్తోందన్నారు. కరువుపై ముఖ్యమంత్రి నేతృత్వంలో కేబినెట్ సమీక్షించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని, రైతులను ఆదుకుంటామని తెలిపారు. వనపర్తిలో ఉన్నది నీళ్ల నిరంజన్ కాదని నీళ్ల దొంగ నిరంజన్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. తన ఫామ్ హౌస్ లలో అక్రమ బోర్లు తవ్వి రైతుల నీటిని మళ్లించుకున్నారని ఆరోపించారు. గతంలో వరి వేస్తే ఉరే అని, నిరుద్యోగులు హామాలీ పని చేసుకోవాలని చెప్పిన వారు ఇప్పుడు వారి పక్షాన మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరంజన్ రెడ్డికి బీ-ఫారం కూడా దక్కదన్నారు. గత తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు రైతుల కష్టాలను రాజకీయ అస్త్రంగా వాడవద్దని, బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా రక్షణే పోలీస్ కర్తవ్యం వర్షంలోనూ రహదారులపై విధులు నిర్వహిస్తూ విస్తృత తనిఖీలు

సూర్యాపేట, నవంబర్ 3 (మనం ప్రతినిధి) మురుసు తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ సూర్యాపేట జిల్లా పోలీసులు ప్రజాభద్రత విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. వర్షం, ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా రహదారులపై విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నారు. వర్షం కురిసినా.. వాతావరణం ఎలా ఉన్నా.. ప్రజల రక్షణే మా బాధ్యత.. ప్రజాభద్రతే మా ప్రథమ కర్తవ్యం అనే సంకల్పంతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు, భద్రతా తనిఖీలు చేపడుతున్నారు. తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, కూడళ్లు, సరిహద్దు ప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచడంతో పాటు నేరస్తులు, అనుమానిత వ్యక్తుల సంచారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోకి అక్రమ వస్తువులు, నిషేధిత పదార్థాలు ప్రవేశించకుండా తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.అదేవిధంగా వర్షాల కారణంగా రహదారులు జారుడుగా మారడం, రహదారులపై నీరు నిలవడం, వాహనాల నియంత్రణ కోల్పోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారులు అతివేగంగా వెళ్లకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.

పుట్టిన గడ్డకు మేలు చేయడమే నా సంకల్పం



నారాయణపేట నవంబర్ 3 (మనం న్యూస్): గ్రామాల వారీగా సమస్యలను స్వయంగా నమోదు చేసుకొని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలను విడివిడిగా గుర్తించి ప్రజాప్రతినిధులతో ఇంత సమగ్రంగా సమీక్షించే కార్యక్రమం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. మక్తల్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నాయకులు మౌనం వీడి గళం విప్పాలని ప్రజలకు వాస్తవాలను వివరించాలని సూచించారు. తాను ఈ గడ్డపైనే పుట్టానని, పుట్టిన నేలకు మేలు చేయాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు.

రూ.2,200 కోట్లతో అభివృద్ధి పనులు..

మక్తల్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఇన్నేళ్లుగా జరగని అభివృద్ధి ఇప్పుడు పెద్ద ఎత్తున జరుగుతున్నందుకు సంతోషపడాలో.. ఇన్నాళ్లు ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని బాధపడాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మక్తల్ ప్రాంతం నేడు తన రూపురేఖలను మార్చుకుంటూ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.500 కోట్లతో బీటీ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాలన్నింటిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. మక్తల్ పట్టణంలో ఆధునిక వైద్య సదుపాయాలతో రూ.80 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, ఈ ఆసుపత్రిని సంక్రాంతిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు రూ.26 కోట్లతో ఆధునిక స్టేడియం నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

నాలుగు లేన్ల రహదారికి రూ.237 కోట్లు

మక్తల్-నారాయణపేట నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.237 కోట్లు మంజూరు చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. భూత్పూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన గ్రామాలకు బదులుగా ఆధునిక హంగులతో నూతన పునరావాస గ్రామాలను నిర్మిస్తున్నామని తెలిపారు. అనుగొండ గ్రామానికి రూ.50 కోట్లు, అంకెన్‌పల్లికి రూ.28 కోట్లు, దాదన్‌పల్లికి రూ.30 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించిందని వివరించారు. చిట్యాల--గజరందొడ్డి బ్యారేజీ కమ్ బ్రిడ్జి, కాట్రేవుపల్లి బ్రిడ్జితో పాటు పలు ప్రాంతాల్లో వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, వాటిలో కొన్ని పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని మంత్రి గుర్తుచేశారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత..

గతంలో మక్తల్ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధి కుంటుపడిందని మంత్రి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల లేక ఇంటర్మీడియట్‌తోనే చదువు ఆపేసిన ఎంతోమంది విద్యార్థులకు ఇప్పుడు మక్తల్‌లో డిగ్రీ కళాశాల అందుబాటులోకి రావడంతో ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం లభించిందన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు నియోజకవర్గానికి చెందిన 64 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించామని పేర్కొన్నారు. గతంలో నారాయణపేటకు వెళ్లాల్సిన కోర్టు సేవలు ఇప్పుడు మక్తల్‌కే అందుబాటులోకి వస్తున్నాయని, ఇది ప్రాంత అభివృద్ధిలో మరో ముఖ్యమైన ముందడుగు అని మంత్రి వివరించారు.

అభివృద్ధిపై విమర్శలు కాదు.. వాస్తవాలు తెలుసుకోవాలి..

మక్తల్-నారాయణపేట నాలుగు లేన్ల రహదారికి ఇప్పటికే రూ.237 కోట్లు మంజూరై, టెండర్లు కూడా పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. అయినప్పటికీ ప్రతిపక్ష మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి రహదారి కోసం పాదయాత్ర చేపట్టడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. అభివృద్ధి పనుల వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. మక్తల్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు జోడెద్దుల్లా సమాంతరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమష్టి అభివృద్ధికే ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. నేను బాగుండాలి అనుకుంటే సరిపోదు.. మనమంతా బాగుంటేనే నియోజకవర్గం బాగుంటుంది. తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అని మంత్రి అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలని సూచించారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

రైతు మేళాను విజయవంతం చేసేందుకు
అధికారులు సమన్వయంతో పని చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట నవంబర్ 3 (మనం న్యూస్) కొడంగల్ నియోజకవర్గంలోని హకీం పేటలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రైతు మేళా కార్యక్రమానికి నారాయణపేట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రైతులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఈ రైతు మేళా కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా నుంచి రైతులను తరలించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రియాంక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు మేళాకు రైతులను తరలించేందుకు మండలాల వారీగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. రైతులకు రవాణా సౌకర్యం, ప్రయాణ ఏర్పాట్లు, భోజన వసతి తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రైతు మేళాకు వెళ్లే బస్సుల వివరాలు, బయలుదేరే సమయాలు, నిర్ణయించిన పికప్ పాయింట్లు, రైతుల సంఖ్య తదితర వివరాలను సంబంధిత యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. లైజనింగ్ అధికారులు బస్సుల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బస్సులు బయలుదేరినప్పటి నుంచి గమ్యస్థానానికి చేరుకునే వరకు పర్యవేక్షించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు అధికారుల బృందాలు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతు మేళా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను,ట్రైనీ కలెక్టర్ ఫణి కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ప్రజారోగ్య శాఖ ఎస్ ఈ విజయ్ భాస్కర్, డిఆర్డిఓ వెంకట్ రాములు, జెడ్పీ డిప్యూటీ సీ ఈ వో సుజాత, ఆర్టీవో మున్నీ, ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణయ్య, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, డీఈఓ గోవింద రాజులు, డీ ఎం వో బాలా మణి, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అగ్రిస్టాక్ అమలుకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

కమిటీ చైర్ పర్సన్‌గా జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట నవంబర్ 3 (మనం న్యూస్) రైతులకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన ప్రభుత్వ సేవలు అందించేందుకు అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రియాంక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రిస్టాక్ కార్యక్రమం అమలు, విధివిధానాలు, వివిధ శాఖల మధ్య సమన్వయంపై సమీక్షించి, అగ్రిస్టాక్ జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్ పర్సన్ గా జిల్లా కలెక్టర్ ప్రియాంక, కన్వీనర్ గా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ వ్యవహరించనున్నారు. అగ్రిస్టాక్ ద్వారా రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, మార్కెటింగ్, పంటల కొనుగోలు తదితర సేవలను సమన్వయం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తద్వారా అర్హులైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సేవలు పారదర్శకంగా, వేగంగా అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ఈ కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతుల వివరాల నమోదు, భూముల రికార్డుల అనుసంధానం, వ్యవసాయ సంబంధిత సమాచార సేకరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ఫణి కుమార్, డిఆర్డిఓ వెంకట్ రాములు, ఎల్ డీ ఎం సురేష్ ఆత్రేయ, జెడ్పీ డిప్యూటీ సీ ఈ వో సుజాత, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మార్కెటింగ్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

22వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరాహార దీక్షలు



న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

నారాయణపేట, నవంబర్ 3 (మనం న్యూస్): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం యూనియన్ గౌరవ అధ్యక్షుడు బిక్షపతి, అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఆరోగ్య శాఖలో కీలక సేవలు అందిస్తున్నప్పటికీ తమ ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, అలాంటి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగులకు భద్రత కల్పించాలని, వేతన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్‌ఎం యూనియన్ కోశాధికారి రాఘవేందర్‌తో పాటు సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, తిరుపతి, శ్రీలత, అర్చన, ఐశ్వర్య, విరోజా, అనురాధ, నందిని, వినోద్, సోహెల్ మునీర్, మంజూర్, జారుద్దీన్, ఆశా బి, రామేశ్వరి, నాగజ్యోతి, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మైనారిటీ గురుకుల పాఠశాలలో తనిఖీ చేసిన జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ రషీద్



నారాయణపేట, నవంబర్ 3 (మనం న్యూస్): మైనారిటీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ రషీద్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశాల మేరకు మంగళవారం నారాయణపేటలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ సొసైటీ బాలుర గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనానికి సంబంధించిన సరుకుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. నాణ్యమైన సరుకులను కొనుగోలు చేసి విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ, వారికి మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నదని జిల్లా మైనారిటీ అధికారి తెలిపారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్నేహమంటే ఇదేరా!

ఆపదలో మిత్రుడికి అండగా నిలిచిన ఆత్మీయులు

గాంధీ హైస్కూల్ 2001-2002 బ్యాచ్ మిత్రుల మానవత్వం..

కొల్లాపూర్‌లో ఆదర్శంగా నిలుస్తున్న స్నేహబృందం

కొల్లాపూర్, నవంబర్ 3 (మనం న్యూస్): స్నేహం అంటే కేవలం కలిసి చదువుకోవడం కాదు.. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనం. ఈ మాటలను నిజం చేస్తూ కొల్లాపూర్ గాంధీ హైస్కూల్ 2001--2002 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ బ్యాచ్‌లోని ఏ మిత్రుడికి ఆపద వచ్చినా అందరూ ఒక్కటై స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అంతేకాకుండా మిత్రుల పిల్లల చదువులకు సైతం ఆర్థిక భరోసా కల్పిస్తూ గతంలో పలువురికి అండగా నిలిచారు. ఇటీవల కుడికిళ్ల గ్రామానికి చెందిన మిత్రుడు ఎస్. అర్జున్ ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులందరూ తమకు తోచినంత డబ్బును జమ చేసి మంగళవారం అర్జున్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు. పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. పాఠశాల చదువులు ముగిసి సంవత్సరాలు గడిచినా స్నేహబంధం మాత్రం చెక్కుచెదరకుండా కొనసాగిస్తూ, మిత్రుడి కష్టాన్ని తమ కష్టంగా భావించి సహాయం చేస్తున్న ఈ స్నేహితుల ఐక్యత, మానవత్వం కొల్లాపూర్‌లో అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఇటికల వెంకటేశ్ యాదవ్, కోన నరేష్, అవుట రాజశేఖర్, ఎండీ ఫిరోజ్ ఖాన్, ఉపేందర్ రెడ్డి, సుదర్శన్, బసవలింగం, జలకం నరేష్ మిత్రులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదామును తనిఖీ చేసిన ఇంచార్జ్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

వనపర్తి నవంబర్ 4 (మనం ప్రతినిధి) : జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాము వద్ద భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను తనిఖీ చేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు అదనపు కలెక్టర్, ఆర్డీవో పూల మొక్కతో ఇంచార్జ్ కలెక్టర్ కు స్వాగతం పలికారు. ఆయన వెంట ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పెబ్బేరులో న్యాయమే గెలిచింది!

అక్రమ కేసును కొట్టివేస్తూ కోర్టు తీర్పు



వనపర్తి, నవంబర్ 04 (మనం ప్రతినిధి) : బాధితుల పక్షాన నిలబడి పోరాడిన నాయకులపై పెట్టిన కేసులో న్యాయమే గెలిచింది. గత మూడు సంవత్సరాల క్రితం పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని వనపర్తి రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు భరోసా కల్పించి వారికి న్యాయం చేయాలని బాధితుల తరఫున నిలబడి నిలదీసినందుకు గత పాలక బీఆర్ఎస్ ప్రభుత్వం, మున్సిపల్ పాలకవర్గం అక్రమంగా కాంగ్రెస్ నాయకులు 14 మందిపై నమోదు చేసిన కేసును మంగళవారం వనపర్తి సెషన్స్ కోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. 174 Cr Pc U/C 341, 290 A/W 34, IPC పలు సెక్షన్ల క్రింద వీణ షకీల్, వీణ షబీర్, రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మొగిలి సత్యా రెడ్డి, గంధం రంజిత్ కుమార్, వెంకట్ రాములు యాదవ్, గంధం రాజశేఖర్, బురమోని రాములు యాదవ్, వినయ్ కుమార్, గంధం సునీల్ కుమార్, ఆ. సాయి గౌడ్, ఎల్లస్వామి, సిద్ది అశోక్, అలివేలమ్మపై నమోదైన అక్రమ కేసును న్యాయస్థానం కొట్టివేయడంతో కాంగ్రెస్ నాయకులకు ఊరట లభించింది. ఈ కేసుకు న్యాయవాదులుగా ఉన్న అడ్వకేట్లు తిరుపతయ్య, త్రినాథ్ లకు వారు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టండి

అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్



వనపర్తి నవంబర్ 4 (మనం ప్రతినిధి) : ప్రతి వర్షపు నీటి చుక్కను భూమిలో ఇంకేలా చూడాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీరు, బట్టలు ఉతికిన, అంట్లు తోమిన నీటిని రోడ్డుపైకి కాకుండా ఇంకుడు గుంతలోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఎల్ నీనో ప్రభావాన్ని అధిగమించేందుకు సాంస్కృతిక శాఖ కళాకారుల ద్వారా మంగళవారం ఏదుల మండలం మాచుపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామస్థాయి అవగాహన కార్యక్రమానికి ఆయనతో పాటు డీఆర్డీఏ పిడి ఉమాదేవి, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సీతారాంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిశాయని, కరువు లాంటి పరిస్థితిని తట్టుకోవడానికి నీటి పొదుపు, విద్యుత్ పొదుపు ఒక్కటే మార్గమన్నారు. ఇంకుడు గుంత ఏర్పాటుకు ప్రభుత్వం రూ.6,500 ఆర్థిక సహాయం అందిస్తోందని, రైతులు తమ పొలాల్లో ఫాం పాండ్ ఏర్పాటుకు రూ.1.30 లక్షల సహాయంతో పాటు ఉపాధి హామీ కూలీల ద్వారా నిర్మిస్తారని తెలిపారు. పశుగ్రాసం పెంపకానికి ఎకరాకు రూ.14 వేల సహాయం, సబ్సిడీపై విత్తనాల పంపిణీ చేస్తున్నామన్నారు. జాబ్ కార్డుదారులంతా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేయాలని కోరారు. అనంతరం మాచుపల్లి శివారులో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేస్తున్న ఫాం పాండ్ ను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి కూలీ డబ్బులు సకాలంలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎదుల ఎంపీడీవో, సర్పంచ్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో వీధి కుక్కల స్వైరవిహారం

ప్రజలకు రక్షణ కల్పించండి!

మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు కౌన్సిలర్ శ్రీదేవి గౌతమ్ గౌడ్ విజ్ఞప్తి

కొల్లాపూర్, నవంబర్ 3 (మనం న్యూస్) : కొల్లాపూర్ పట్టణంలోని 18వ వార్డులో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నుంచి ప్రజలకు తక్షణమే రక్షణ కల్పించాలని కౌన్సిలర్ శ్రీదేవి గౌతమ్ గౌడ్ మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌లను కోరారు. వార్డులోని పలు కాలనీల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ అటుగా వెళ్లే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆమె తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల వెంట కుక్కలు పరుగులు తీయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులను సైతం వెంటాడుతూ దాడులకు పాల్పడటం, గాయపరచడం వంటి ఘటనలతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వీధి కుక్కల నియంత్రణకు సంబంధిత చట్టాలు, జంతు సంక్షేమ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకొని, 18వ వార్డులో నెలకొన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కౌన్సిలర్ శ్రీదేవి గౌతమ్ గౌడ్ అధికారులను కోరారు.

పుట్టిన ఊరిపై మమకారం.. స్వగ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు!

ప్రభుత్వ యునాని వైద్యురాలిగా పెంట్లవెల్లి ప్రజలకు అండగా డాక్టర్ జోత్స్న

గ్రామీణులకు ఉచిత వైద్యం.. యునాని వైద్య విధానంపై అవగాహన కల్పించడమే లక్ష్యం



కొల్లాపూర్, నవంబర్ 3 (మనం న్యూస్): పుట్టిన ఊరిపై మమకారం సొంత గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పెంట్లవెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ యునాని వైద్యురాలు డాక్టర్ జోత్స్న విశేష సేవలందిస్తున్నారు. వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తూ, తన స్వగ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఆమె సేవల పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెంట్లవెల్లి మండలంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ యునాని వైద్య కేంద్రం ద్వారా డాక్టర్ జోత్స్న ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులకు అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించడంతో పాటు అందుబాటులో ఉన్న మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో యునాని వైద్య విధానంపై అవగాహన పెంపొందిస్తూ, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జోత్స్న మాట్లాడుతూ.. దీర్ఘకాలిక చర్మ సంబంధిత వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, మొలల సమస్యలు, మూత్రపిండాలు, గర్భాశయ సంబంధిత సమస్యలతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి యునాని వైద్య విధానంలో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. అవసరమైనప్పుడు సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించడం కూడా ముఖ్యమని తెలిపారు.

పీజీ ప్రవేశాలకు మరో అవకాశం

కొల్లాపూర్‌లో స్పాట్ అడ్మిషన్లు!

నవంబర్ 4 నుంచి 7 వరకు ప్రవేశాల ప్రక్రియ

అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కొల్లాపూర్, నవంబర్ 3 (మనం న్యూస్): పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు పాలమూరు విశ్వవిద్యాలయం మరో అవకాశం కల్పిస్తోంది. కొల్లాపూర్‌లోని పాలమూరు విశ్వవిద్యాలయం పీజీ కేంద్రంలో 2026--27 విద్యా సంవత్సరానికి వివిధ పీజీ కోర్సుల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పీజీ కేంద్రం ప్రిన్సిపాల్ డా. సి. అశోక్ కుమార్ వెల్లడించారు. పీజీ విద్యను అభ్యసించాలనే ఆసక్తి ఉండి, ఇప్పటివరకు ప్రవేశం పొందని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలతో నేరుగా కొల్లాపూర్ పీజీ కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 6309901035, 9440239539 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వదులుకోకుండా నవంబర్ 4 నుంచి 7వ తేదీలోపు పీజీ కేంద్రాన్ని సంప్రదించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని డా. సి. అశోక్ కుమార్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఈ సమాచారాన్ని తోటి విద్యార్థులకు, స్నేహితులకు తెలియజేయాలని పీజీ కేంద్రం సూచించింది.

నాగర్‌కర్నూల్ టీడీపీ కమిటీల ఏర్పాటుకు వినతి

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలి

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జోష్ణకు వినతిపత్రం అందజేత



కొల్లాపూర్, నవంబర్ 3 (మనం న్యూస్) : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు దాని పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జోష్ణ మేడంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ బాబు గారికి తమ విజ్ఞప్తిని చేరవేసి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్లు నాయకులు తెలిపారు. పార్టీ కార్యకలాపాలను మరింత చురుగ్గా నిర్వహించడంతో పాటు, నాయకులు, కార్యకర్తలకు తగిన బాధ్యతలు అప్పగించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కమిటీల ఏర్పాటు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కొల్లాపూర్ తాలూకా టీడీపీ సీనియర్ నాయకులు వి. సుధాకర్, లచ్చగౌడ్, నాగర్‌కర్నూల్ అధికార ప్రతినిధి కొప్పుల రమేష్, కొనమోని సత్యనారాయణ, కొనమోని కురుమయ్య, ఆకునమోని చంద్రయ్య యాదవ్, ఆటో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మల్లెల స్వప్నకు ఘన సన్మానం

మండల అభివృద్ధికి అందరి సహకారం అవసరం: తహసీల్దార్

ఉప్పునుంతల, నవంబర్ 3 (మనం న్యూస్) : ఉప్పునుంతల మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మల్లెల స్వప్నను మంగళవారం డిండి కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్, ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. మండలంలోని లత్తిపూర్ గ్రామపంచాయతీ శివారులో హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన ఉన్న డిండి కట్ట మైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లెల స్వప్నకు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మల్లెల స్వప్న మాట్లాడుతూ, మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు ఇదే విధంగా పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ ఉప్పునుంతల మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిండి కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్, ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు, పెద్దాపురం గ్రామ ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అంతటి శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.




ప్రసవ సమయంలో ఐ డోంట్ కేర్!

9 నెలల గర్భిణిని మరో ఆసుపత్రికి పంపిన వైనం!

ఉదయం మూడు ప్రసవాలు చేశాను.. ఇక చేయలేను!

సుశ్రుత ఆసుపత్రిలో ఇంత డాక్టర్ నిర్లక్ష్యమా?



మహబూబ్‌నగర్, నవంబర్ 03, (మనం జిల్లా ప్రతినిధి) : మహబూబ్‌నగర్ జిల్లాలో నిండు గర్భిణికి సకాలంలో ప్రసూతి వైద్య సేవలు అందలేదన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రసవ సమయం సమీపించిన మహిళకు వైద్యసేవలు అందించకుండా మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించిన ఘటన జడ్చర్ల నియోజకవర్గ పరిధిలో వెలుగుచూసింది. బాధితురాలి కథనం ప్రకారం.. జడ్చర్ల నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన గర్భిణి మొదట ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుండగా, తాను పనిచేస్తున్న ప్రైవేట్ కంపెనీకి సుశ్రుత ప్రజా వైద్యశాలతో వైద్య సేవల ఒప్పందం ఉండటంతో రెండు నెలల క్రితం తప్పని పరిస్థితిల్లో అక్కడికి మారింది. ఆసుపత్రిలో వైద్యులు తిరిగి అవసరమైన పరీక్షలు నిర్వహించి అక్టోబర్ 30న ప్రసవ తేదీగా సూచించినట్లు బాధితురాలు తెలిపారు. దీంతో అక్టోబర్ 29న ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లిన ఆమెకు ప్రసవ నొప్పులు ప్రారంభం కాలేదని, మరో రెండు మూడు రోజుల్లో రావాలని సిబ్బంది సూచించినట్లు బాధితురాలు తెలిపింది. ఈ క్రమంలో నవంబర్ 3న తిరిగి ఆసుపత్రికి వెళ్లగా, అక్కడి వైద్యుడు ఇప్పటికే ముగ్గురికి ప్రసవం చేశానని, ప్రస్తుతం వైద్యం అందించలేనని, మరో ఆసుపత్రికి వెళ్లి ప్రసవం చేయించుకోవాలని చెప్పినట్లు ఆమె ఆరోపించింది. ప్రసవానికి సిద్ధంగా ఉన్న సమయంలో మరో ఆసుపత్రికి వెళ్లాల్సి రావడంతో బాధితురాలు తీవ్ర ఆందోళనకు గురైంది. చివరి దశలో ఇలా పంపిస్తే తమ పరిస్థితి ఏమిటని కన్నీటి పర్యంతమైనట్లు సమాచారం. ప్రసూతి వైద్యంలో గర్భిణి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, ప్రసవ సమయానికి తగిన వైద్య సదుపాయాలు కల్పించడం అత్యంత కీలకం. ముఖ్యంగా ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన మహిళకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించాల్సిన బాధ్యత వైద్యశాలపై ఉంటుంది. ఈ ఘటనపై బాధితురాలి ఆరోపణలను ఆసుపత్రి యాజమాన్యం పరిశీలించి వివరణ ఇవ్వాల్సి ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, ఆరోపణల్లో వాస్తవాలను నిర్ధారించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులు చదువులో రాణించాలి

మెనూ ప్రకారం వంట చేయని ఏజెన్సీని తొలగించాలని ఆదేశాలు

వైద్య ఉపకేంద్రం సిబ్బందికి షోకాజు నోటీసుల జారీ

ఇంటర్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 3 (మనం బ్యూరో) : ప్రభుత్వ పాఠశాలలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు చదువులో రాణించాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పర్యటించారు. ముందుగా గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించి విద్యార్థులు పాఠశాలకు ఎక్కువగా సెలవులు పెట్టకుండా సూచించాలని, ఇంటి వద్ద కూడా చదువుకునేలా ప్రోత్సహించాలని తెలియజేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కులపై ఆరా తీశారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ఎక్కువగా దృష్టి సారించాలని, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులు అందరూ 550కు పైగా మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండనందుకు ప్రస్తుత ఏజెన్సీని తొలగించి, కొత్త వారిని నియమించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ ను ఆదేశించారు.

గ్రామంను పరిశుభ్రంగా ఉంచాలి

జల్లాపురం గ్రామంలో పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రోగాలు వ్యాపించకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైద్య ఉపకేంద్రం వద్దకు వెళ్ళగా తాళం వేసి ఉండడంతో ఉపకేంద్రంలోని సిబ్బంది అందరికీ షోకాజు నోటీసులు జారీ చేయాలని డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయితో ఫోన్లో మాట్లాడిన కలెక్టర్ ఆదేశించారు.

ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

అనంతరం జిల్లా కలెక్టర్ మానవపాడు మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఇంజనీరింగ్, వైద్య విద్య లాంటి ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు ప్రణాళికతో చదవాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా ఎప్పటికప్పుడు అధ్యాపకులను అడిగి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ప్రతి మనిషి జీవితంలో ఇంటర్మీడియట్ కీలక దశ అని, భావి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఈ దశలో విద్యార్థులు చదువు పైనే ఎక్కువగా దృష్టి సారించాలన్నారు. ఆంగ్లంలో మంచి పట్టు సాధించాలని, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి కంప్యూటర్ నాలెడ్జ్ అవసరమని, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లోనూ సత్తా చాటాలని, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందజేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సుమారు మూడు నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున విద్యార్థులందరూ బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందిని, ఇంటర్ నోడల్ అధికారి హృదయ రాజ్, తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, ఎంపీడీవో రాఘవ, కళాశాల ప్రిన్సిపల్ మంజుల, ఇతర అధికారులు, తదితరులున్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీ పోటీలు

రాష్ట్రస్థాయి ఎంపికలు



ఉప్పునుంతల, నవంబర్ 3 (మనం న్యూస్): మండలంలోని మారుమూల గ్రామమైన వెల్టూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు వేదికగా నిలుస్తోంది. పాఠశాల ఆవరణలో నేడు బుధవారం అండర్-17 బాలబాలికల ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) కబడ్డీ టోర్నమెంట్‌తో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలల బాలబాలికల క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఉత్సాహంగా పోటీల్లో తలపడనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు వివరించారు. మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణ బాధ్యతలు దక్కడం గ్రామానికి గర్వకారణంగా నిలుస్తోంది. పాఠశాలలో క్రీడలకు ప్రోత్సాహం కల్పిస్తూ, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ చేస్తున్న కృషి అభినందనీయమని గ్రామస్తులు, యువకులు పేర్కొన్నారు. మారుమూల గ్రామమైన వెల్టూర్‌కు జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌లను గ్రామస్తులు, యువకులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సివిల్ సప్లయ్‌లో అవినీతి అధికారులపై విచారణ జరపాలి

బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



వనపర్తి నవంబర్ 4 (మనం ప్రతినిధి) : సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న డీఎస్ఓ, డీఎంల అవినీతిపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులపై ఏసీబీ, సీఐడీ సోదాలు జరిపి అక్రమాస్తులు జప్తు చేయాలని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.9.5 కోట్ల ధాన్యాన్ని దుర్వినియోగం చేసిన మిల్లు ఆస్తుల బదిలీకి రూ.కోటి లంచం తీసుకుని ఎన్వోసీ ఇచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంపై తక్షణ విచారణ జరపాలన్నారు. వనపర్తి జిల్లాలో అనుమతులు లేవంటూ రెండు మిల్లులను కూల్చివేసినా వాటికి ధాన్యం, మిల్లింగ్ అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వనపర్తిలో డీఎస్ఓ పీవీ చేసి క్లీన్ చిట్ ఇచ్చిన రెండు రోజులకే విజిలెన్స్ పీవీలో 14 వేల బస్తాలు తేడా రావడం వెనుక అవినీతి ఉందని మండిపడ్డారు. ఒక్కో సీజన్‌లో ఒక్కో అధికారి రూ.3 నుంచి 4 కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారని, ధాన్యం సేకరణ, గన్నీ బ్యాగులు, ట్రక్ షీట్లు, టెండర్లు, రవాణా బిల్లులు, స్టాక్ ధ్రువీకరణ, జూట్ సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతి అధికారుల చిట్టాను త్వరలో ఏసీబీ, సీఐడీకి అందజేస్తామన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు వివి గౌడ్, కరెంట్ నరసింహ, దేవర శివ, బత్తుల జితేందర్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడికి అండగా సహచరులు

ఉప్పునుంతల, నవంబర్ 3 (మనం న్యూస్): ఆపదలో ఉన్న తోటి కార్మికుడికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు సహచరులు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తమ మిత్రుడు చాంద్ పాషా పరిస్థితిని చూసి చలించిపోయిన తోటి కార్మికులు ఆయనకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా త్రివేణి సంఘం, ప్లంబర్ అండ్ ఎలక్ట్రానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాంద్ పాషాకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తోటి మిత్రుడికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయాన్ని అందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. తోటి కార్మికుడికి ఆపద సమయంలో సహచరులు చూపిన ఔదార్యం పలువురి ప్రశంసలు అందుకుంది. ఐకమత్యం, పరస్పర సహకారంతోనే కష్టాలను అధిగమించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో త్రివేణి సంఘం, ప్లంబర్ అండ్ ఎలక్ట్రానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పాత్కుల బాల్ రాం, ఉపాధ్యక్షుడు శవ్వ కుర్మయ్య, ఎం.డి. మహమ్మద్, పాత్కుల కొండల్, బింగి పార్వతాలు, పాత్కుల నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



రూ.1,778 కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు పునర్వ్యవస్థీకరణ

జిల్లాలోని మండలాల వారీగా కరువు తీవ్రత గుర్తింపు

గ్రామాల వారీగా అర్హులైన రైతుల గుర్తింపు

అర్హులైన రైతులకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలి

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 3 (మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 13 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో, కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించడం, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ (ూస్త్రతీఅఽబశ్రీబతీుశ్రీ శ్రీుఅ =వర్‌తీబఖీబతీఅఅస్త్ర), నూతన పంట రుణాల మంజూరు తదితర అంశాలపై, అదనపు కలెక్టర్లు బి. చేన్నయ్య, దేవ సహాయం లతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బ్యాంక్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యంలో పంట నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని జిల్లా కలెక్టర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా రుణ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 10 మండలాలు ఉర్కుండ, వెల్దండ, వంగూర్, చారగొండ, అమ్రాబాద్, పదర, బల్మూర్, లింగాల పెద్ద కొత్తపల్లి, కోడేరు మండలాల్లో పంట నష్టం జరిగినట్లు తీవ్రత మండలాలుగా గుర్తించిన, అర్హత కలిగిన రైతుల వ్యవసాయ రుణాలకు 12 నెలల మారటోరియం కల్పించి, రుణాల తిరిగి చెల్లింపు వ్యవధిని గరిష్ఠంగా 60 నెలల వరకు పొడిగించేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కల్వకుర్తి, అచ్చంపేట బిజినపల్లి, మరో మూడు మండలాలు పాక్షికంగా కరువు మండలాలను ప్రకటించగా అర్హులైన రైతుల వ్యవసాయ రుణాలకు 12 నెలల మారటోరియం కల్పించి, రుణాల తిరిగి చెల్లింపు వ్యవధిని గరిష్ఠంగా 36, నెలల వరకు స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. మారటోరియం ముగిసిన అనంతరం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రుణాల చెల్లింపులు జరిగేలా చూడాలని బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా బ్యాంకుల ద్వారా 65,893 మంది రైతులు రూ.1,125.10 కోట్ల విలువైన పంట రుణాలు పొందగా, మరో 27,297 మంది రైతులు రూ.653.41 కోట్ల విలువైన వ్యవసాయ కాలపరిమితి రుణాలు పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రుణాలకు సంబంధించి నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కరువు పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గడంతో పాటు సాగునీటి కొరత ఏర్పడి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందించాలని స్పష్టం చేశారు. రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు తదుపరి పంటల సాగు కోసం రైతులకు కొత్త పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. కరువు ప్రభావిత రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారిపై ఎలాంటి ఒత్తిడి లేదా బెదిరింపులకు పాల్పడరాదని స్పష్టం చేశారు. అర్హులైన రైతుల నుంచి బలవంతపు రుణ వసూళ్లు చేయకూడదని బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లాలో కరువు పరిస్థితులు, పంట నష్టాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని మండలాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. పంట నష్టం అధికంగా ఉన్న మండలాల్లో రైతులకు అవసరమైన ఉపశమన చర్యలు అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాలు, మండలాల వారీగా అర్హులైన రైతులను, వారి రుణ ఖాతాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు వేదికలు, గ్రామసభలు, ఆర్థిక అక్షరాస్యత శిబిరాల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో బ్యాంకు శాఖల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించి, రుణ పునర్వ్యవస్థీకరణ అమలు పురోగతిపై నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కరువు పరిస్థితుల్లో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, ఆర్బిఐ ఏజీఎం ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డీడీఎం చందు, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంతరావు జిల్లాలోని వివిధ బ్యాంక్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సోదరా నీ మరణం మాకు తీరని లోటు

డైలీ వేజ్ వర్కర్ కుటుంబానికి తోటి కార్మిక ఉద్యోగులు ఆర్థిక సాయం



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 3 (మనం బ్యూరో) : గత 25 ఏళ్లుగా గిరిజన విద్యార్థులకు సేవలందించిన డైలీ వేజ్ వర్కర్ మంతటి వసంత మృతి బాధాకరమని తోటి డైలీ వేజ్ వర్కర్లు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖలో డైలీ వేజ్ వర్కర్‌గా పనిచేస్తున్న మంతటి వసంత్ కుమార్ కుమార్ అనారోగ్య కారణంగా మరణించడం పట్ల మంగళవారం మృతుడు వసంత కుటుంబానికి తోటి కార్మికులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. నాగర్‌కర్నూల్ జిల్లా డైలీ వేజ్ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో తోటి కార్మికులందరూ కలిసి మృతుడు వసంత కుమార్ స్వగ్రామమైన మన్ననూర్ లో వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతి గృహం వార్డెన్ యు. కాశన్న రూ.5 వేలు, మన్ననూర్ బాలుర వసతి గృహం వార్డెన్ రాములు రూ.2 వేల ఆర్థిక సహాయం అందించారు. మొత్తం కలిపి బాధిత కుటుంబానికి రూ.17 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డైలీ వేజ్ వర్కర్ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖలో డైలీ వేజ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ గిరిజన విద్యార్థుల సేవలో తన వంతు కృషి చేసిన మంతటి వసంత్ కుమార్ మరణం అత్యంత బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికుల జీవితాలు నేటికీ అభద్రతలోనే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధిలో డైలీ వేజ్ వర్కర్ల పాత్ర కీలకం అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, బాలుర , బాలికల వసతి గృహాలు, కళాశాల వసతి గృహాల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు గిరిజన విద్యార్థుల దైనందిన అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, వసతి గృహాల నిర్వహణ, భోజన ఏర్పాట్లు, పారిశుద్ధ్య పనులు తదితర బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ వారికి సరైన ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా, ఇతర ఉద్యోగ ప్రయోజనాలు లేకపోవడం బాధాకరమని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను గుర్తించి వారికి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉండగా కార్మికులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచి వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వార్డెన్లు యు. కాశన్న, రాములుకు డైలీ వేజ్ వర్కర్ల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైలీ వేజ్ వర్కర్ల రాష్ట్ర నాయకులు మద్దెల సురేందర్, గోపాల్, ఓం ప్రకాష్, లింగమ్మ, పర్వతాలు, రాంజీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

వెనుకబడ్డ సబ్జెక్టులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి

ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రతిభ చాటాలి

ఎస్ఎస్సి విద్యార్థుల పరీక్షల ఫలితాల నివేదిక పంపాలి

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 3 (మనం బ్యూరో) : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలో రాణించాలన్న ప్రణాళికతో చదివి ప్రతిభ చాటాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల మార్కుల వివరాలను అడిగారు. సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కుల గురించి తెలుసుకొని తగు సూచనలు చేశారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా పాఠ్యాంశాలను తరచు పునఃశ్చరణ చేసుకోవడం వలన పరీక్షల్లో ప్రతిభ చాటేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థుల దినచర్యను తెలుసుకొని, తెల్లవారుజామునే నిద్రలేచి చదవడం వలన ఆయా పాఠ్యాంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా చదవడం వలన పరీక్షల సమయంలో ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా రాయవచ్చన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

విద్యార్థులు తమ జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలంటే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను అనుగుణంగా సమాజంలో గౌరవ ప్రతిష్టలు పొందేందుకు, మంచి స్థాయిలో స్థిరపడేందుకు విద్యార్థి దశ నుంచే ప్రతి పౌరుడు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యార్థుల్లో చదువు పట్ల సీరియస్ నెస్ లేకపోతే ఎవరు కూడా గౌరవించరని, తమ భావి జీవితమంతా అంధకారం అవుతుందన్నారు. కాబట్టి విద్యార్థులు బాధ్యతతో చదవాలని, తమ భావి జీవితాన్ని గొప్పగా మలుచుకోవాలని తెలిపారు

ఐదుగురు విద్యార్థులపై ఒక టీచర్ పర్యవేక్షణ

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఇప్పటినుంచే అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ చాటేలా ప్రతి ఐదుగురు విద్యార్థులకు ఒక టీచర్ ను నియమించి పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పరీక్షల సమయంలోనే చదవడం సరికాదని, ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. గతేడాది ఎస్ఎస్సి పరీక్ష ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా వంద శాతం ఉత్తీర్ణత ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి సబ్జెక్టుల వారిగా వారికి వచ్చిన మార్కుల వివరాలను నవంబర్ పదవ తేదీలోగా తమకు పంపాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫోన్లో డీఈవో విజయలక్ష్మిని ఆదేశించారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుకా దేవి, తదితరులున్నారు.



తుఫాను హెచ్చరికతో నేడు పేట మార్కెట్ కు సెలవు

సూర్యాపేట టౌన్, నవంబర్ 03, మనం న్యూస్: మురసు తుఫాను వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కారణంగా భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉండంతో నేడు (బుధవారం) సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డునకు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి, కార్యదర్శి ఫసియోద్దిన్ లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకురావొద్దని, ఈ విషయమై కమిషన్ దారులందరికీ తెలియజేయడం జరిగిందని, ఎవరైనా కమిషన్ దారులు ఉద్దేశపూర్వకంగా సరుకులు తెప్పించి మార్కెట్ కమిటీ కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఎడల తగు చర్యలు తీసుకోవడంతో పాటు వారి వివరాలను ఈ నామ్ పోర్టల్ నుంచి తొలగించడం జరుగుతుందని కమిషన్ దారులు గుర్తించి గమనించాలన్నారు.

సామాజిక బాధ్యతగా ఓటరు నమోదుకు పిలుపు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకుకు నవంబర్ 6న గడువు

పొడిగించాలని నాయకులు డిమాండ్

హైదరాబాద్‌కే పరిమితమవుతున్న ఎమ్మెల్సీలు

క్షేత్రస్థాయి సమస్యలపై నోరు విప్పే గొంతుక కావాలి



మహబూబ్ నగర్ ముదిరాజ్ కోఆర్డినేషన్ సంఘం

మహబూబ్‌నగర్, 03నవంబర్, (మనం న్యూస్) : మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి అర్హులైన ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముదిరాజ్ కోఆర్డినేషన్ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని. ప్రెస్ క్లబ్ నిర్వహించిన సమావేశం లో సంఘం ప్రముఖ నాయకుడు మెట్టుకాడి శ్రీనివాసులు ముదిరాజ్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను విస్తృతంగా వివరించారు.సమర్థులైన ప్రతినిధులను ఎన్నుకుందాం గతంలో ఎన్నికైన ఎమ్మెల్సీలు అత్యధికులు రాజధాని హైదరాబాద్‌కేపరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని శ్రీనివాసులు ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రుల సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తూ, నిత్యం ప్రజల మధ్య ఉంటూ శాసనమండలిలో బలమైన గొంతుక వినిపించే ప్రతినిధులు నేడు అత్యవసరమన్నారు. సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధత ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాలంటే ముందుగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావలసిందేనని పిలుపునిచ్చారు.ప్రస్తుతం ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా చాలామంది నమోదు చేసుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి నమోదు గడువును మరికొంత కాలం పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

అణగారిన వర్గాల గొంతుక మండలిలో వినపడాలి

సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు ఆది కృష్ణమోహన్ ముదిరాజ్, చి. రాజయ్య, పిట్టల మురళి, ఎం. జగన్, జంగం రవి, ఎం. రమేష్, హరిప్రసాద్, మెట్టుకాడి ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు మండలిలో పోరాడే నాయకత్వం రావాలన్నారు. న్యాయవాదులు, వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయుల సమస్యలతో పాటు బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సబ్బండ వర్గాల ప్రజల సమస్యలను చట్టసభల్లో లేవనెత్తాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 ప్రకారం పట్టభద్రులకు శాసనమండలిలో దక్కిన ఈ ప్రత్యేక ప్రాతినిధ్య హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా నవంబర్ 6 లోగా ఫారం -18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, గ్రామీణ ప్రాంత పట్టభద్రులకు ఈ విషయమై అవగాహన కల్పించాలని ముదిరాజ్ కోఆర్డినేషన్ సంఘం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అది కృష్ణమోహన్, సి ఎచ్ రాజయ్య,మంత్రి శ్రీనివాస్ పిట్టల మురళి, మెట్టుకాడి ప్రభాకర్, హరిప్రసాద్, జంగం రవి,జనార్ధన్,ఏం రమేష్, జగన్ ముదిరాజ్, సత్యనారాయణ రాజశేఖర్,బారు మూర్తి, నరేష్, కిషోర్ బాలకిష్టయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోశమ్మ తల్లికి బోనం.. ఉద్యోగ భద్రత కోసం వేడుకోలు

22వ. రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

78 కేడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

తక్షణమే ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయాలి

ఎన్ హెచ్ ఎం, జెఏసి జిల్లా ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 3 (మనం బ్యూరో) : ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో సేవలందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కోసం చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 22వ. రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో పోశమ్మ తల్లికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 78 కేడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వానికి సద్బుద్ధి ప్రసాదించాలని మంగళవారం అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం, జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలను కాపాడటమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల జీవితాలకే భద్రత లేకపోవడం విచారకరమన్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి ప్రజల ప్రాణాలను కాపాడిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు, నేడు తమ కుటుంబాల భవిష్యత్తు కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపరించడం బాధాకరమన్నారు. 78 కేడర్ల ఉద్యోగుల క్రమబద్ధీకరణే మా ప్రధాన ఎజెండని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని ఈ సమ్మె వేదిక సందర్భంగా కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, నల్లమల ముద్దుబిడ్డ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. 22 రోజులుగా ఎండనకా, వాననకా సమ్మె చేస్తున్న ఉద్యోగుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్చలకు ఆహ్వానించాలన్నారు. 78 కేడర్ల ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సానుకూల నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు. ప్రజల ప్రాణాలు కాపాడిన మా సేవలకు గుర్తింపు ఇవ్వండి.! మా కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించండి. ! 78 కేడర్ల ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి న్యాయం చేయండి" అని దామగట్ల కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం, జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, శ్రీనివాసులు, హైమవతి, జగన్, ప్రవీణ్, భీముడు, ప్రకాష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాల పరిష్కారానికి రీ సర్వే



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 3 (మనం బ్యూరో) : ప్రభుత్వ భూములను కాపాడడంతోపాటు భూ తగాదాలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే పనులు చేయిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మానవపాడు మండలం జల్లాపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న రీసర్వే పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. నిబంధనలను అనుసరించి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, హద్దుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతుల పొలాల సర్వే విషయంలో పక్క చేను రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇరుపక్షాల సమక్షంలో నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు సర్వేకు సహకరించాలని, ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సమీప పొలాల రైతులు కలెక్టర్ ను కలవగా వివిధ అంశాలపై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు రబీ సీజన్ లో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లలో ఉన్న కొద్దిపాటి నీళ్లను వచ్చే వర్షాకాలం వరకు తాగునీటి అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. పంటలకు సాగునీటిని విడుదల చేసే అవకాశం లేదని తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా మాత్రమే పంటలు సాగు చేయాలని, ఎలాంటి నీటి వసతులు లేని రైతులు ఏ పంటలు సాగు చేయవద్దన్నారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాన్నారు. వివిజి రాంజీ పథకంలో జలసిరి కార్యక్రమంలో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, తదితర జల సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతు కూలీలు వ్యవసాయ పనులు చేయలేకపోతున్నామని నిరుత్సాహ పడకుండా ఉపాధి హామీ పనులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే లబ్ధి పొందవచ్చన్నారు. ఉపాధి హామీలో కాలువల వెంట పెరిగిన ముళ్ల పొదలను తొలగించడంతోపాటు డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానల్ కాలవల్లో పూడికతీత పనులు కూడా చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ పర్యటనలో సర్పంచ్ నందిని, సర్వే ఏడి నూకరాజు, తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, డిప్యూటీ తహసిల్దార్ రాములు, ఆర్ఐ గురురాజు, సర్వేయర్ ఇలాయత్, తదితరులున్నారు.



ఎల్‌నినో ఎఫెక్ట్.. ఎండుతున్న రైతన్న ఆశలు

మొదటి పేజీ తరువాయి

పొలాలను సందర్శించి వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పక్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సాగు చేసిన వరి, టమాట, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంటలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయిన పరిస్థితిని రైతు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా వరి పంటకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడంతో పంటను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తాను ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నానని, పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతు తన ఆవేదనను కలెక్టర్‌కు వివరించారు. రైతు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ విచారం వ్యక్తం చేస్తూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో మరో ఇద్దరు రైతులు సాగు చేసిన వరి పంటలను కూడా కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు లేకపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. గత సంవత్సరం ఇదే సమయంలో వర్షపాతం ఎలా ఉందని, అప్పట్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని, ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే దిగుబడులు, పెట్టుబడులు, ఆదాయంలో ఎంత తేడా వచ్చిందని రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వర్షపాతంపై ప్రభావం చూపే అవకాశం ఉందని, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడం వల్ల ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు రైతులకు భారంగా మారుతోందని తెలిపారు. రైతులు కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి వినియోగం అవసరమయ్యే సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని తెలిపారు.

రైతులకు అండగా

ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో పంటల పరిస్థితి, నీటి వనరుల లభ్యత, సాగు విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలిస్తూ రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు నీటి పొదుపు పద్ధతులపై సూచనలు చేయాలని పేర్కొన్నారు. రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని, ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి నష్టాలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో రైతులకు సరైన సమయంలో వ్యవసాయ సలహాలు అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయ శాఖ